సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



పింఛాకు జలకళ

పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం 4గం టలకు 558 క్యూసెక్కులు వచ్చింది. డ్యాం లో నీటి నిల్వ పెరుగుతోంది. -8లో



ముగిసిన పరిపేతురు తిరునాల

కలసపాడు నగిలేరు ఒడ్డున వెలసిన పురాతన పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయ 137వ ప్రతిష్టా మహోత్సవాలు మం గళవారం ముగిశాయి. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.2/24.8

జిల్లాలో మంగళవారం 24.8 – 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆర్‌జేడీ బాధ్యతల స్వీకరణ



దేవిడ్‌కుమార్ స్వామి

వైవీయూ: కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా డేవిడ్‌కుమార్ స్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కడప నగరంలోని కళాశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కళాశాల విద్య కమిషనరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను రెగ్యులర్ ఆర్‌జేడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన ఆర్‌జేడీని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా, అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఏడాది కాలంలో ముగ్గురు ఆర్‌జేడీలు మారగా, తాజాగా రెగ్యులర్ ఆర్‌జేడీగా ఈయన బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

కర్మాగారాల లైసెన్స్ రుసుం చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: కర్మాగారాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2025వ సంవత్సరానికి చెల్లించాల్సిన నిర్ణీత లైసెన్స్ రుసుం ఈనెల 31లోగా సీఎఫ్‌ఎంఎస్ ద్వారా చెల్లించాలని కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత చలానాను కడపలోని సంబంధిత కర్మాగారాల తనిఖీ అధికారికి చేరేలా పంపాలని ఆయన పేర్కొన్నారు. రుసుం చెల్లించే హెడ్ ఆఫ్ అకౌంట్, డీడీఓ కోడ్‌లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లు : 9160383971, 9295850949లలో సంప్రదించాలని వివరించారు.

కొనసాగుతున్న వర్షం

కడప అగ్రికల్చర్: ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం బద్వేలు డివిజన్ పరిధిలోని కొన్ని మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. ఇందులో భాగంగా కలసపాడు మండలంలో 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పోరుమామిళ్లలో 40.4, కాశినాయన 40, లింగాల 29.2, సింహాద్రిపురం 23.6, వేంపల్లి 22.4, పులివెందుల 22, అట్లూరు 19.4, వేముల 12, గోపవరం 9.6, బి.మఠం 6.8, వీఎన్‌పల్లి 8.8, తొండూరు 8.6, బి.కోడూరు 7.2, కడప 6.4, పెండ్లిమర్రి 6.2, చక్రాయపేట, బద్వేలు 6, పెద్దముడియం 5.6, జమ్మలమడుగు, ఒంటిమిట్ట 5.2, చాపాడు 5, రాజుపాళెం 4.6, ముద్దనూరు 4.2, కమలాపురం , వల్లూరు 3.4, చింతకొమ్మదిన్నె 3.2, ప్రొద్దుటూరు, మైదుకూరు 3, ఎర్రగుంట్ల, దువ్వూరు 2.8, కొండాపురం 2.4, ఖాజీపేటలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

చట్టాలపై అవగాహన అవసరం

కడప కోటిరెడ్డిసర్కిల్: విభిన్న ప్రతిభావంతులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు కడప నగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది కాంత మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై అవగాహన పెంపొందించడం, వారి హక్కులు తెలియజేయడం, సహాయ సహకారాలు అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పారా లీగల్ వలంటీర్ జెఎల్ శ్రీనివాసరావు, అల్‌షిఫా మానసిక విభిన్న ప్రతిభావంతుల పురావాస కేంద్రం వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగని శిక్షణలు



- ఉపాధ్యాయులకు రెసిడెన్సియల్‌గా తరగతులు
- ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న సంఘాలు
- గుండెపోటుతో ఇద్దరు హెచ్‌ఎంల మృతి
- పట్టించుకోని ప్రభుత్వం




కడప గీతం కళాశాలలో నిర్వహించిన రెసిడెన్సియల్ శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: 'ఉపాధ్యాయులపై ఎటువంటి ఒత్తిళ్లు ఉండవని, బోధనకే పరిమితం చేస్తామని ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చాక వేధింపులకు గురి చేస్తోంది' అని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పని ఒత్తిడి సంగతి అటుంచితే.. రెసిడెన్సియల్ విధానంలో అందిస్తున్న శిక్షణలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఫౌండేషన్ లిటరసీ న్యూమిరేషన్(ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇప్పటికే హైస్కూళ్లలో అనేక రకాల పనులతో ఇబ్బంది పడుతున్న ప్రధానోపాధ్యాయులకు ఇది అదనపు భారంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రధానోపాధ్యాయుడికి తీవ్ర అస్వస్థత

వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులు ప్రాణాల మీదికి తెస్తున్నాయని ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి. మొదటి విడత శిక్షణలో భాగంగా గత నెల 6న ఏలూరు జిల్లా అగిరిపల్లిలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నకుమార్ గుండె పోటుతో మరణించాడు. తాజాగా ఆరు రోజుల కిందట పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం నేరడి గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపురపు శ్రీనివాసరావు శిక్షణ సమయంలోనే గుండె పోటుతో మృతి చెందాడు. అలాగే చీరాలలో మరో ప్రధానోపాధ్యాయుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. ఇలా వరుసగా జరుగుతున్న సంఘటనలపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.



కానరాని మార్పు

మొదట ఉపాధ్యాయుడు చనిపోయినప్పుడు కొన్నాళ్ల పాటు వాయిదా వేసి.. ఆ సంఘటన మరిచిపోగానే మళ్లీ మొదలు పెట్టారు. ఆలోచించి చెబుతామని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. అయితే రెసిడెన్సియల్ శిక్షణను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ విధానంలో మార్పు కనిపించడం లేదని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

విద్యా సంవత్సరం మధ్యలో ఏమిటి?

విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు దాటిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌జీటీలకు ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ అనే అంశంపై, అలాగే హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు లీడర్ షిప్ ప్రోగ్రాం పేరుతో రెసిడెన్సియల్ శిక్షణ మొదలు పెట్టింది. దీంతో ఉపాధ్యాయులు బోధనా కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతున్న తరుణంలో.. విద్యార్థుల చదువులు ముందుకు సాగకపోవడంతో మరింత నష్టం కలుగుతుంది. వేసవి సెలవుల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డిసెంబర్ రెండో వారంలో..

ఇప్పటికి మూడు విడతల శిక్షణ పూర్తయింది. మొదటి విడత నవంబర్ 11 నుంచి 16 వరకు, రెండో విడత 18 నుంచి 23, మూడో విడత 25 నుంచి 30 వరకు నిర్వహించారు. నాలుగో విడత ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. 350 మంది హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలకు 450 మందికి శిక్షణ పూర్తయింది. ఈ సారి నిర్వహించే రెసిడెన్సియల్ శిక్షణలో మరెవరి వంతోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు రోజులు అక్కడే..

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులపాటు జరిగే రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమాలకు శిక్షణ కేంద్రాల్లోనే రాత్రిపూట ఉండాల్సి ఉంటుంది. అక్కడ వసతులు లేకపోవడం, ఎక్కువ సమయం శిక్షణలో పాల్గొనడం వంటి సమస్యలతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా హెచ్‌ఎంలు ఎక్కువ మంది పదోన్నతులు లభించే నాటికే 50 ఏళ్ల వయసు పైబడిన వారు ఉంటున్నారు. వారిలో చాలా మంది దీర్ఘకాలిక (బీపీ, షుగర్) వ్యాధులతో బాధపడుతుంటారు. ఇలాంటి వారు చాలా ఇబ్బందులకు గురవుతు న్నారు. ఈ రెసిడెన్సియల్ శిక్షణలను రద్దు చేసి నాన్ రెసిడెన్సియల్ విధానంలో నియోజకవర్గ లేదా డివిజన్ స్థాయిలో నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ప్రయోజనం ఏమిటో?



ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్సియల్ శిక్షణ తరగతులు శిక్ష లాంటివి. రెసిడెన్సియల్ విధానంలో నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులకు అదనంగా ఒనగూరేదేమిటో అర్థం కావడం లేదు. అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు.
-మాధవ విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

ఇద్దరు హెచ్‌ఎంల మృతి బాధాకరం



రెసిడెన్సియల్ శిక్షణ వల్ల ఇప్పటికే ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మృతి చెందారు. వారు తీవ్ర ఒత్తిడికి లోనై శిక్షణ కేంద్రంలోనే గుండెపోటుతో మరణించడం బాధాకరం. ఇప్పటికైనా ఉపాధ్యాయుల డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలి.
- శ్యామసుందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీటీఎఫ్

రెసిడెన్సియల్ శిక్షణ రద్దు చేయాలి



దీర్ఘకాలిక వ్యాధులు, చిన్నపిల్లలు ఉండే ఉపాధ్యాయులు ఆరు రోజుల పాటు కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమాలు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి.
- ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీఎఫ్

ప్రభుత్వ మొండి వైఖరి వల్లే..



రెసిడెన్సియల్ శిక్షణ విషయంలో ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారు. ఇప్పటికైనా రెసిడెన్సియల్ ట్రైనింగ్‌లను రద్దు చేసి జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో నాన్ రెసిడెన్సియల్ శిక్షణ తరగతులు నిర్వహించాలి.
- లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, పీఎస్టీయూ

డిగ్రీ పరీక్ష పేపర్ లీక్



రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయచోటి టౌన్: యోగివేమన విద్యాలయం పరిధిలోని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో సెమిస్టర్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. మంగళవారం సంస్కృత భాష పరీక్ష నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత ఫంకజ్ పనిమీద అనంతపురం జిల్లాకు వెళ్లినట్లు సమాచారం. ఆమె మెయిల్‌కు వచ్చిన ప్రశ్నాపత్రాన్ని తాను సెలవులో ఉండటంతో తమ సిబ్బందితో కలిసి ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసింది. వాట్సాప్‌లో వచ్చిన పేపర్‌ను గ్రూప్‌లో ఉన్న ఒకరు బయటికి లీక్ చేయడంతో అది కాస్త చెక్కర్లు కొట్టి మీడియ వద్దకు చేరింది. ఈ విషయం తెలియడంతో అప్రమత్తమైన ప్రిన్సిపల్ మరో పది..పదిహేను నిమిషాలలో డిలీట్ చేసింది. ఈ విషయమై ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

పరీక్ష రద్దు

వైవీయూ: వైవీయూ పరిధిలో మంగళవారం నిర్వహించిన సంస్కృతం పరీక్షను రద్దు చేసినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్షా సమయంలో ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందని వదంతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. విషయం తెలియగానే పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావును పరీక్ష కేంద్రానికి పంపి స్వీయ పరిశీలన చేయించామన్నారు. కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయించి నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఒక విద్యార్థి, వైఎస్సార్ జిల్లాలో 99 మంది విద్యార్థులు రాసే ఈ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామన్నారు. పరీక్ష తేదీ ఎప్పుడన్నది తర్వాత తెలియజేస్తామన్నారు. పరీక్షల విధుల్లో ఉన్నవారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

ఏపీజీబీ కార్యాలయం తరలింపు ఆపాలి



మాట్లాడుతున్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించే యత్నాన్ని తక్షణమే ఆపాలని వివిధ సంఘాల నాయకులు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీజీబీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, మద్దిలేటి మాట్లాడారు. సంప్రదాయం ప్రకారం చూసినా, ఆర్థికశాఖ మార్గదర్శకాల తొలి ప్రాధాన్యత క్రమంగా చూసినా కార్యాలయం కడపలోనే కొనసాగించడం సముచితమన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బీఐ అనుమతించిన చెస్ట్ సౌకర్యం, సొంత భవనాలు ఏపీజీబీకే మిగతా వాటి కంటే మిన్నగా ఉన్నాయన్నారు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో ప్రధాన కార్యాలయం ఉంటేనే ప్రజలకు ఉప యుక్తంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల విన్నపాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్ర స్థాయి గ్రామీణ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీజీబీ ఉద్యోగ సంఘాల నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లలిత, అజీజ్, హరిప్రసన్నకుమార్, మహమ్మద్, హనుమంతరెడ్డి, ఎల్‌ఐసీ యూనియన్ నాయకుడు అవధానం శ్రీనివాస్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాఘవరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గండికోటలో సినిమా షూటింగ్

జమ్మలమడుగు రూరల్: పర్యాటక ప్రాంతమైన గండికోటలో తెలుగు సినిమా షూటింగ్ జరుగుతోంది. 'దేవగుడి' అనే సినిమాలోని సన్నివేశాలను మంగళవారం చిత్రీకరించారు. కోటలోని మాధవరాయస్వామి ఆలయం, జుమ్మా మసీదు, పెన్నాలోయ పరిసర ప్రాంతాల్లో సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. నిర్మాత, దర్శకుడు రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్ నిర్వహించారు. సినీ నటులను చూసేందుకు స్థానికులతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. దీంతో గండికోటలో సందడి నెలకొంది. కొన్ని నెలల క్రితం దేవగుడి, ఎస్.ఉప్పలపాడు గ్రామాల్లో షూటింగ్ నిర్వహించినట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.



జుమ్మా మసీదులో సినీ నటులు, చిత్ర యూనిట్ సభ్యులు

ప్రజా సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, జిల్లా అధికారులు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి


కడప సెవెన్‌రోడ్స్: ప్రజల సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూములు, డాటెడ్ ల్యాండ్స్, వాటర్ టాక్స్, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీదారుడిని ఆప్యాయంగా పలకరించి, సమస్యను అర్థం చేసుకొని అర్జీలను స్వీకరించాలని అన్నారు. డివిజన్, మండల స్థాయిలో అర్జీదారుడు ఇబ్బంది పడకుండా అర్జీ రాసి ఇచ్చేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఒక షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. ఈ సదస్సుల్లో వచ్చే అర్జీలను స్వీకరించి, పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

టెన్త్, ఇంటర్, డిగ్రీ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు మానసిక వికాసం, నైపుణ్యం, నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ మీనాక్షి, ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య, ఇంటర్ ఆర్‌జేడీ రవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో గుర్తింపు పోరు

- పోటాపోటీగా ఎన్నికల ప్రచారం
- 4,5,6న పోలింగ్‌కు సన్నాహాలు





దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బ్రాంచ్ కార్యాలయం

రాజంపేట: రైల్వేలో కార్మికుల గుర్తింపు ఎన్నికల పోరు తారస్థాయికి చేరుకుంది. రైల్వే యాజమాన్యం పోలింగ్‌కు సర్వం సిద్ధం చేస్తోంది.ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రధాన రైల్వేస్టేషన్లలోని బ్రాంచి ప్రతినిధులు తమ పరిధిలోని కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈనెల 4, 5 తేదీల్లో జరిగే ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కార్మికులు, ఉద్యోగులకు విన్నవిస్తున్నారు. ఎన్నికల్లో 30శాతం ఓట్లు సాధించిన కార్మిక సంఘాలను క్రమసంఖ్య ఆధారంగా గుర్తింపు సంఘాలుగా గుర్తించి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎన్నికల ప్రచారపర్వం సోమవారం ముగిసింది.

పోటీపడుతున్న యూనియన్లు

ఈ ఎన్నికల్లో ప్రధానంగా దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ తలపడుతున్నాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకార్మిక సంఘ్(డీఎంఆర్‌కేఎస్), ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ), రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్ఎంయూ)లు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి.

2019లో జరగాల్సి ఉండగా...

2013 ఏప్రిల్ మాసంలో భారతీయ రైల్వేలో గుర్తింపు కార్మికసంఘాల ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ విజయం సాధించిన సంగతి విదితమే. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా..కోవిడ్ కారణంతో రైల్వే యాజమాన్యం వాయిదా వేస్తూ వచ్చింది.

సీక్రెట్‌బ్యాలెట్ ద్వారా...

రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలు కూడా ఇదే పద్ధతిలో నిర్వహించారు. నందలూరు, కోడూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. వీటి పరిధిలో ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలను రెండు కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి.

ఓటర్ల వివరాలు



నందలూరు:	391
కడప:	320
కోడూరు:	298
ఎర్రగుంట్ల:	410
కొండాపురం:	280
ప్రొద్దుటూరు:	270

వివిధ సంఘాల మేనిఫెస్టోలోని ప్రధానాంశాలు

- ఉద్యోగులందరికీ రిస్క్–హార్డ్ డ్యూటీ అలవెన్స్
- ట్రాక్ మెయింటెయినర్లకు రిస్క్ అలవెన్స్ పెంపు
- ఉద్యోగులందరికి టూవీలర్ భత్యం
- ఉద్యోగుల పిల్లలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యాభత్యం చెల్లింపు
- అన్ని రకాల క్వార్టర్స్‌లో ఏసీలు బిగించేందుకు ఏర్పాట్లు
- ఉద్యోగుల తల్లిదండ్రులకు రైల్వేపాస్, వైద్య సదుపాయం కల్పించడం
- 70 శాతం రన్నింగ్ అలవెన్స్ ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు
- పీఎల్‌బీ బోనస్ సీలింగ్ ఎత్తివేసి అసలు జీతంపై బోనస్ చెల్లింపు
- అన్ని కేటగిరిల్లో ఉద్యోగ ఖాళీలను సత్వరమే భర్తీ చేయించడం

పింఛాకు జలకళ!

ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన పింఛా సమీపంలో నిర్మించిన యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టు గిరిజన ప్రాంతాలకు వరప్రసాదిని. ప్రాజెక్టు ఎగువ భాగంలో పడే వర్షపు నీరు ప్రాజెక్టులో చేరి దిగువ భాగంలో వేలాది మంది సాగుభూమికి నీరు అందిస్తుంది. దుస్థితిలో ఉన్న ఈ జలాశయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ కలిగింది. ఆ ఫలితంగానే నేడు డ్యాంలో నీటి నిల్వ చేసుకునే పరిస్థితి ఉంది.

- డ్యాం పునర్ నిర్మాణం తర్వాత తొలిసారిగా నీటి నిల్వ
- వైఎస్సార్‌సీపీ పాలనలో 95 శాతం పనులు పూర్తి
- క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న వరద నీరు
- రూ.84.33 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ సర్కారు


నీటితో కళకళలాడుతున్న పింఛా డ్యాం

రాజంపేట : ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న పింఛా డ్యాం పునర్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది. 2022 నవంబరు 2న డ్యాం పునర్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలను తీసుకుంది. ఈ డ్యాం పునర్ నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.84.33 కోట్ల నిధులను మంజూరు చేశారు. రైట్‌మెయిన్ కెనాల్, హెడ్‌వర్క్స్, రింగ్‌బండ్ నిర్మాణ పనులను చేపట్టారు. అప్పటి నుంచి సార్వత్రిక ఎన్నికల ముందు నాటికి 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు వరదలు వస్తున్న క్రమంలో డ్యాంలో నీటి నిల్వకు అవకాశం కలిగింది. దీనికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి అని ఆయకట్టుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పింఛా నిర్మాణ స్వరూపమిలా..

చెయ్యేరు(బహుదా, మాండవ్య, పింఛా) ఉపనదిపై పింఛా ప్రాజెక్టు నిర్మించారు. మొత్తం 3773.41 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రాజంపేట నియోజకవర్గం టి.సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మితమైంది. 1954 సంవత్సరం అక్టోబర్ 1న నిర్మాణం ప్రారంభించి 1960 సంవత్సరం అక్టోబర్ 28న పూర్తిచేశారు. ఈ డ్యాంకు వై. ఆదినారాయణరెడ్డి పేరు పెట్టారు. పీలేరు, తలకోన ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వరదనీరు డ్యాంలోకి వచ్చి చేరుతుంది.

ప్రయోజనం పొందే గ్రామాలు..

పింఛా జలాశయం వలన ముడుంపాడు, ఆరోగ్యపురం, కందులవారిపల్లె, నందనాయక్ బిడికి, వాయిలొడ్డు, మాచిరెడ్డిగారిపల్లె, శ్రీరాములురెడ్డి గారిపల్లె, కరువపల్లె, చెరుకువారిపల్లె, పెద్దినేనికాలువ, పల్లి ఈడిగిపల్లె, రాచపల్లె, రెడ్డివారిపల్లె, బెస్తపల్లె, రాయవరం ఉన్నాయి.

1960 నుంచి..

1960 నుంచి ప్రాజెక్టు అందుబాటులో ఉన్న నీటిలో 0.765 టీఎంసీ ఉపయోగించుకుంది. రిజ్వరాయర్ నిల్వ సామర్థ్యం 0.3276 టీఎంసీ (స్థూల), 0.3222 టీఎంసీ(నికరం). ప్రాజెక్టు వ్యయం రూ.0.60కోట్లు (ఎస్ఎస్ఆర్1954). ఏపీసీబీటీఎంసీ కార్యక్రమం కింద కాలువల ఆధునికీకరణ చేపట్టి పనులు పూర్తిచేశారు. ఎఫ్‌టీఎల్ ప్లస్ 304.880మీ, ఎండబ్ల్యుఎల్ ప్లస్ 304.880మీ, టీబీఎల్ ప్లస్ 307.320మీ గా ఉంది. ఉచిత పరీవాహక ప్రాంతం 555.50 చ.కి.మీ, అడ్డగించిన ప్రాంతం 1108.50చ.కి.మీ, కంబైన్డ్ క్యాచ్‌మెంట్ ఏరియా 1664 ఎస్‌క్యూకెఎం, డెడ్‌స్టోరేజి 5.4 ఎంసీఎఫ్‌టీ, ప్రత్యక్ష నిల్వ 322.2 ఎంసీఎఎఫ్‌టీ కాగా మొత్తం నిల్వ 327.60 ఎంసీఎఫ్‌టీగా నిర్ణయించారు.

డ్యాం : పింఛా

ఇన్‌ఫ్లో	: 558 క్యూసెక్కులు
ప్రస్తుత లెవల్	: 989.20 ఎంఎఫ్‌టీ
సామర్థ్యం	: 0.14730 టీఎంసీలు
పర్సంటేజ్ ఆఫ్ వాటర్	: 44.9 శాతం
అవుట్ ఫ్లో	: నిల్

ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

సుండుపల్లె : పింఛా ప్రాజెక్టు నిండి నీటితో కళకళలాడుతోంది. మంగళవారం 1072 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి రాగా 3779 క్యూసెక్కుల నీటిని బయటకు పంపిస్తున్నారు. ప్రస్తుతం 1000 అడుగుల నీరు 0.3276 టీఎంసీలుగా నిల్వ ఉందని ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు.

పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు



పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం 4గంటలకు 558 క్యూసెక్కులు నీరు వచ్చింది. డ్యాంలో నీటి నిల్వ పెరుగుతోంది. డ్యాం నుంచి అవుట్‌ఫ్లో లేదు. డ్యాంకు ఉన్న ఆయకట్టుకు సాగు నీరు, తాగునీటి సౌకర్యం కలుగుతుంది. వరదనీటి అంచనాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. – బుక్కే నాగేంద్రనాయక్, ఏఈఈ, పింఛాడ్యాం, సుండుపల్లె

క్లుప్తంగా

ఇరువురి అరెస్టు

ముద్దనూరు : ఈనెల 1వతేదీన మండలంలోని వేల్పుచెర్ల గ్రామంలో గొర్రెల చోరీ విషయంలో జరిగిన ఘర్షణలో ఇరువురిని అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మంగళవారం చిన్నదుద్యాల క్రాస్ వద్ద ఈ కేసులో నిందితులైన ఈశ్వరయ్య, శంకర్‌లను అరెస్టు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం


గజ్జె రంగయ్య (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కీరుపల్లెలో నివాసం ఉంటున్న గజ్జె రంగయ్య (47) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 2:20 గంటల సమయంలో బ్యాంకు దగ్గర పని ఉందని తన భార్యతో చెప్పి వెళ్లి మరలా రాలేదు. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం, పెటికాయలగుల్ల గ్రామానికి చెందిన ఈయన సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో రైతుసాధికారిక విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన భర్త ఇంటికి రాలేదని భార్య గద్దసురే చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు చిన్నచౌక్ ఎస్ఐ- 9121100521కుగానీ, సీఐ- 9121100520కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

గుడిలో వెండి ఆభరణాలు చోరీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పోట్లదుర్తి గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఉన్న దేవుడికి సంబంధించిన శఠగోపంతో పాటు ఇతర వెండి ఆభరణాలు ఉండేవి. ఉదయాన్నే గుడి తెరిచేందుకు ఆలయ ప్రధాన అర్చకులు వచ్చారు. గుడిలో ఉన్న స్వామి వారి 600 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొలంలో గేదెలను మేపారని మహిళలపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : తన పొలంలో గేదెలను మేపారని వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి మహిళలపై దాడి చేశాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపాడు మండలంలోని రామదాసుపురానికి చెందిన పేట వెంకటసుబ్బయ్య 20 ఎకరాల పొలాన్ని రూ. 1.50 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. అందులోనే గడ్డి పెంచి 200 పొట్టేళ్లను పోషించుకుంటున్నాడు. సీతంపల్లె పంచాయతీలోని ఎర్రగుంట్లపల్లెకు చెందిన కొందరు మహిళలు గేదెలను తోలుకొని మంగళవారం రామదాసుపురం పొలాల్లోకి వెళ్లారు. ఈ క్రమంలో 100కు పైగా గేదెలు వెంకటసుబ్బయ్య పొలంలోకి వెళ్లి గడ్డి మేయసాగాయి. కొద్ది సేపటి తర్వాత అక్కడికి వచ్చిన వెంకటసుబ్బయ్య చేనులో మేస్తున్న గేదెలను చూసి కోపోద్రిక్తుడయ్యాడు. గేదెలను మేపుతూ అక్కడే ఉన్న రామతులసి, ఓబుళమ్మ, మాధవి, గంగాదేవిలను కట్టెతో తలపై, కాళ్లపై కొట్టడంతో వారికి రక్త గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం వారిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

హత్య కేసులో నిందితుల కోసం పోలీసుల వేట

ప్రొద్దుటూరు క్రైం : రౌడీ షీటర్ పప్పీ హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రొద్దుటూరులోని సంజీవనగర్‌కు చెందిన రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీ సుందరాచార్యుల వీధిలోని బీజీఆర్ లాడ్జిలో సోమవారం వేకువ జామున హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత పప్పీతో పాటు లాడ్జీ గదిలో ఉన్న లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు పరారయ్యారు. అప్పటి నుంచి వారి ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి. దీంతో వారే ఈ హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరో వ్యక్తి ముజీబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అతను చెప్పిన విషయాల ఆధారంగా మద్యం మత్తులో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకొని తర్వాత హత్యకు దారి తీసినట్లు పోలీసులు భావిస్తున్నారు. లోకేశ్వరరెడ్డి, సునీల్‌ల ఇళ్లతో పాటు బంధువుల ఊళ్లలో పోలీసులు గాలించారు. వారి మొబైల్ ఫోన్లపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఇంత వరకు వారి ఆచూకీ తెలియలేదు. ఎక్కడున్నారనే సమాచారం కూడా లభించలేదని పోలీసులు చెబుతున్నారు.

మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగింత

పప్పీ మృతదేహానికి మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పప్పీ మృతదేహాన్ని చూసేందుకు అతని స్నేహితులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడిగా వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండల పరిషత్ ప్రెసిడెంట్ (ఎంపీపీ) చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీపీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంపీపీల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్యాంపు కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ప్రభుత్వ విప్, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలసి వీరనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వీరనారాయణరెడ్డిని రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించడంపై మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.


సజ్జల రామకృష్ణారెడ్డితో బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి

ముగిసిన పరిపేతురు తిరునాల



దైవసందేశం ఇస్తున్న రెవరెండ్ డాక్టర్ పి.వరప్రసాదరావు, గుడి ప్రదక్షిణ చేస్తున్న విశ్వాసులు

కలసపాడు : కలసపాడు సగిలేరు ఒడ్డున వెలసిన పురాతన పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు ఆలయ 137వ ప్రతిష్టా మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నంద్యాల డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ పి.వరప్రసాదరావు భక్తులకు దైవసందేశం ఇచ్చారు. సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డీనరీ చైర్మన్ ఆనందకుమార్, ప్రెస్బిటర్ ఆసిస్‌గాబ్రియేల్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్ కుమార్ (చిన్ను) చర్చి చరిత్ర ప్రతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. బాలాయపల్లెకు చెందిన రవికుమార్ వారిచే చెక్కభజన, గుమ్మడి జీవన్‌కుమార్ వారిచే నిర్వహించిన ధనవంతుడు-లాజరు క్రైస్తవ నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ చిరంజీవి, కాశినాయన ఎస్ఐ హనుమంతు, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ అదనపు చార్జీల భారాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ అదనపు చార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ అదనపు భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, అదాని ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు తిరగకముందే రూ.15,484 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం దారుణమన్నారు. 2022 -23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్ పై రూ. 6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల పేరుతో నేడు జనం నుంచి వసూలు చేయటం శోచనీయమన్నారు. విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉండగా సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు 70 శాతం ఉండటం దారుణమన్నారు. మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యురాలు జమీలా, కామనూరు శ్రీనివాస్ రెడ్డి, దస్తగిరి రెడ్డి, కుమారస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల బయోడేటాలను స్వీకరిస్తున్న రవీంద్రనాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం కడప నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో కడప అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అనుబంధ విభాగాల అధ్యక్షుల బయోడేటాలు ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన క్యాడర్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజం తదితరులు పాల్గొన్నారు.

పూజకు వెళ్లి కుందూ నదిలో వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు సుబ్బమ్మ

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం సమీపంలో గల కుందూ నదిలో మంగళవారం పూజలు చేసుకునేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో గల్లంతై అల్లాడుపల్లెకు చెందిన నూకబోయిన సుబ్బమ్మ(70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న అల్లాడుపల్లెకు చెందిన సుబ్బమ్మ మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కుందూనది వద్ద స్నానం చేసి పూజలు చేసుకునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదశాత్తు నీటిలో గల్లంతైంది. సుబ్బమ్మ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో చెల్లెలి కుమారుడు మునీంద్ర సుబ్బమ్మ మొబైల్ నంబరుకు ఫోన్ చేయగా స్థానికులు ఫోనుతీసి సుబ్బమ్మ నదిలో పడిపోయినట్లు తెలిపారు. దీంతో మునీంద్ర కుటుంబీకులతో కలసి నది వద్దకు వచ్చి పరిశీలించగా సుబ్బమ్మ మృతి చెంది ఉంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. మృతురాలికి వివాహితులైన ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె గ్రామ సమీపంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 11 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.59,390 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

వర్రా కేసులో విచారణ ముమ్మరం

పులివెందుల రూరల్ : సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్ర రెడ్డి కేసుకు సంబంధించి విచారణ ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో సునీతారెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, లింగారెడ్డి రాజశేఖర్ రెడ్డిలను పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విచారించారు.

జిల్లాలో ఇద్దరు ఎస్ఐల బదిలీ

కడప అర్బన్ : జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఇన్‌చార్జి ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కలసపాడు ఎస్ఐగా పనిచేస్తున్న కె. చిరంజీవిని మైదుకూరు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ ఎస్ఐగా బదిలీ చేశారు. మైదుకూరు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న బి.ఘన మద్దిలేటిని కలసపాడు ఎస్ఐగా బదిలీ చేశారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి (జగదాంబసెంటర్) : మతాంతర వివాహం చేసుకున్న తమకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును ప్రేమజంట పి.మునీరా, కె.దేవేంద్ర శుక్రవారం విన్నవించారు. వారి కథనం మేరకు.. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన పఠాన్ ఖలీల్ బాషా కుమార్తె పి.మునీరా.. రైల్వేకోడూరు మండలం జంగిటివారిపల్లి హరిజనవాడకు చెందిన చిన్నయ్య కుమారుడు దేవేంద్ర పరస్పరం ప్రేమించుకున్నారు. వీరికి మైనర్ తీరడంతో రైల్వేకోడూరులోని ఓ దేవాలయంలో మతాంతర వివాహం చేసుకున్నారు. కానీ వధువు తరపు బంధువులు దేవేంద్రను బెదిరిస్తుండటంతో జిల్లా ఎస్పీని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. తమ ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నట్లు మునీరా ఎస్పీకి వివరించారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ అన్నప్పగారిపల్లెకు చెందిన విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. విద్యార్థి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన యువకుడితో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

టీడీపీ కార్యకర్తలు తిట్టారంటూ ఎస్పీకి ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ఏహెచ్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ఆది మౌనిక తనను ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కులం పేరుతో దూషించారని ఎస్పీకి, జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తుండగా గుర్రప్పగారిపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు రామకృష్ణరాజు, అమరేశ్వర రాజు, సాయి, రాయుడు, గంగయ్య మరికొంత మంది నాయకులు అక్కడికి వచ్చి తాము చెప్పిన వారి పేరు మినీ గోకులం జాబితాలో ఎందుకు పెట్టలేదంటూ కులం పేరుతో దూషిస్తూ తనను కొట్టేందుకు వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నెలలోపు ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలి


ఐక్యతను చాటుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కడప రూరల్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ ఏకసభ్య కమిషన్ ఒక నెలలోపు నివేదికను సమర్పించేలా చూడాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.నాగరాజు కోరారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ వర్గాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేఎన్ రాజు, నాయకులు బాబు, శివయ్య, మాతయ్య, సంజీవ్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లెకు చెందిన సతీష్‌కుమార్ తన అత్త సరసమ్మ(45)ను తన స్వగ్రామమైన తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వదిలిపెట్టి వచ్చేందుకు ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముదివేడు సమీపంలో వెళుతుండగా, వెనుకవైపు నుంచి మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో సరసమ్మ తీవ్రంగా గాయపడగా, 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జనసేన నాయకుడికి టీడీపీ నేత బెదిరింపులు!

– గ్రూపుల్లో వాయిస్ రికార్డు హల్‌చల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో జనసేన, టీడీపీ మధ్య విభేధాలు గుప్పుమంటున్నాయి. తాజాగా మంగళవారం రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం లేబాక గ్రామంలో జనసేన నాయకుడు మారటపల్లెకు చెందిన శివను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు బెదిరించిన వాయిస్ రికార్డు బహిర్గతం కావడంతో జనసేన వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీలో చేరిక సభను లేబాక గ్రామంలో నిర్వహించారు. ఈ సభకు జనాన్ని సమీకరించే విషయంలో శివ కీలకంగా వ్యవహరించాడని ఆగ్రహంతో ఆ నాయకుడు ఊగిపోయాడు. లేబాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జనసేన నాయకుడు శివకు ఫోన్ చేసి తమ సామాజిక వర్గాన్ని జనసేన సభకు ఎందుకు తీసుకెళ్లావంటూ ప్రశ్నించాడు. నీ భార్య ఆర్‌ఎంపీ కావచ్చు, నీవు ఇంజక్షన్ ఏ విధంగా వేస్తావని టీడీపీ నాయకుడు బెదిరించాడు. డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తాను. నిన్ను ఎవరు కాపాడుతాడో చూద్దాం అంటూ గద్దించాడు. సాతుపల్లె మాదిగలతో కొట్టిస్తానని, ఎస్ఐకు చెప్పి కేసు పెట్టిస్తా, నీ అంతుచూస్తా అంటూ బెదిరింపులకు దిగాడు. టీడీపీ నాయకుడు వ్యవహరించిన తీరుపై జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.

ఎస్పీ చొరవతో గల్ఫ్ నుంచి గాలివీడుకు చేరుకున్న బాధితురాలు

రాయచోటి : ఉపాధి కోసం సౌదీకి వెళ్లి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నీరుగుట్టు రమణమ్మ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. గాలివీడుకు చెందిన నీరుగుట్టు రమణమ్మ బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లింది. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సేఠ్‌కు తెలిపినా ఇంటికి పంపకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని భర్త నీరుగుట్టు ఆంజనేయులుకు సమాచారం అందింది. బాధితురాలి భర్త ఆంజనేయులు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీని కలిసి గల్ఫ్‌లో తన భార్య పడుతున్న ఇబ్బందులను తెలియజేసి ఇంటికి రప్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై తక్షణం స్పందించిన జిల్లా ఎస్పీ సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితురాలిని స్వదేశానికి రప్పించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రయత్నాలు ఫలించడంతో సోమవారం ఉదయం సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నట్లు ఎస్పీ ఆఫీసు నుంచి సమాచారం అందింది. సోమవారం స్వగ్రామానికి చేరుకున్న బాధితురాలు రమణమ్మ భర్తతో కలిసి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


బాధితురాలు రమణమ్మ, భర్త ఆంజనేయులు

ఆస్తులు వక్ఫ్‌బోర్డ్‌వి అయితే ఇన్నేళ్లు ఏం చేశారు?

అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం కమిటీ సభ్యుల ధ్వజం

మదనపల్లె : అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ ఆస్తులు వక్ఫ్‌బోర్డువి అయితే 24 ఏళ్ల అధికారులు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ట్రస్ట్ అధ్యక్షుడు, టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్.ఏ.మస్తాన్, ట్రెజరర్ ఐనుల్లా ప్రశ్నించారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన మైనారిటీ ఆస్తులపై పెద్దల కన్ను వార్తపై అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్ మాట్లాడుతూ అంజుమన్-ఏ- హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ ముస్లిం సమాజానికి జవాబుదారీగా పనిచేస్తుందే తప్ప ప్రభుత్వానికి, వక్ఫ్‌బోర్డుకు జవాబుదారీ కాదన్నారు. ట్రస్ట్ తన పరిధిలో కార్యకలాపాలను చేసుకుంటూ వెళుతుంటే, వక్ఫ్‌బోర్డుకు చెందిన అధికారుల అనాలోచిత నిర్ణయాలతో గందరగోళం ఏర్పడిందన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్‌కు అనుభవం, అవగాహన లేకపోవడంతో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించేశారన్నారు. అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం-ట్రస్ట్ ఆస్తుల విషయాన్ని జిల్లా కలెక్టర్, వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్.జెడ్.నాసిర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్, ట్రెజరర్ ఐనుల్లా తదితరులు